క్లుప్తంగా

మన కోసం అనుక్షణం ఆలోచించేది అమ్మే



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: అనుక్షణం మన కోసం ఆలోచించేది అమ్మ ఒక్కరే అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎస్.అరవింద్ కుమార్ అన్నారు. బొమ్మూరులోని జీపీఆర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'దేశభక్తి -నైతిక విలువలు పెంపు' అనే అంశంపై వాత్సల్య భారతి ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ మాట్లాడుతూ అమ్మ రుణం తీర్చుకోవడం ఎవరి వల్ల కాదని, అందువల్ల అమ్మ తల పైకెత్తుకుని తిరిగేలా పిల్లలు ప్రవర్తన ఉండాలని సూచించారు. ఎస్ఎస్‌సీ బోర్డు విశ్రాంత డిప్యూటీ కమిషనర్ ఎంవీ కుమార్ స్వామి మాట్లాడుతూ భారతదేశం గొప్పతనం ప్రపంచానికి చాటేలా విద్యార్థులు తయారు కావాలని పిలుపునిచ్చారు. మనిషికి నీరు ఎంత అవసరమో నీతి కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైట్ విశ్రాంత లెక్చరర్ రాం ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వేణు పరామర్శ



రత్నం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేణు

కడియం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ గురువారం కడియం మండలంలో పలువురిని పరామర్శించారు. మాధవరాయుడుపాలెంలో పార్టీ నాయకుడు సింగన ప్రకాష్ భార్య రత్నం ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబాన్ని వేణు పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. బుర్రిలంకలో రత్నం బాబులు మృతికి తన సంతాపాన్ని వ్యక్తం చేసి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, గిరజాల బాబు, సంగిత సూరిబాబు, వెంకటేశ్వరరావు, కొత్తపల్లి శివాజీ, సాపిరెడ్డి సూరిబాబు తదితరులు ఉన్నారు.

వారాహీ అమ్మవారికి పూజలు



వారాహీ యాగంలో పాల్గొన్న భక్తులు

కడియం: వారాహీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి స్థానిక భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహీ మహాయాగాన్ని వేదపండితుల పర్యవేక్షణలో చేపట్టారు. వారాహీ నవరాత్రుల ప్రాధాన్యం, యాగ ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు.

సాధి కమిటీతో డీఎల్ఎస్ఏ సమావేశం

కంబాలచెరువు: ఆధార్ ట్రాకింగ్ సమగ్ర చేరిక ప్రాప్యత సర్వే సాధీ కమిటీ సభ్యులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గురువారం సమావేశమైంది. అలాగే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఇతర సాధీ 2 సభ్యులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధి సర్వే ద్వారా ఆధార్ కార్డు లేని అనాథ పిల్లలు ఎంతమందిని గుర్తించారని ప్రశ్నించారు. అలాంటి పిల్లలకు ఆధార్ నమోదు చేయడానికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు, వాటిని సమకూర్చుకునే విధానాలను తెలిపారు. ఈ ప్రక్రియలో ఎటువంటి సందేహాలున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, గోకవరం, రాజానగరం తహశీల్దార్లు, ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్ అధికారులు, విద్య, వైద్య శాఖ, ఎన్‌జీవోలు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం



మెటీరియల్ అందజేసిన గెయిల్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: పాఠశాల ప్రాంగణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రాజమహేంద్రవరం గెయిల్ ఇండియా లిమిటెడ్ మేనేజర్లు వైవీఎస్ మూర్తి, అమ్ము కుమార్ శర్మ అన్నారు. నగరంలోని చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ హైస్కూల్‌కు క్లీనింగ్, శానిటరీ మెటీరియల్‌ను గురువారం అందించారు. కార్యక్రమంలో గెయిల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల తరఫున కూటమిపై పోరాటం

- మోసం చేసి గద్దెనెక్కిన చంద్రబాబు
- ఎన్నికల హామీలను విస్మరించిన వైనం
- బాధితులకు అండగా ఉందాం
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో మాజీ మంత్రి వేణు
- ఎంఆర్ పాలెంలో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ, చిత్రంలో స్టాలిన్, గిరజాల బాబు తదితరులు

కడియం: కూటమి నాయకుల హామీలను నమ్మి మోసపోయిన ప్రజలకు అండగా ఉందామని, వారి తరఫున పోరాటం చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మాధవరాయుడుపాలెంలో పార్టీ నాయకుడు వేంకటేశ్వరరావు ఇంటి వద్ద గురువారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేణు మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులు, మహిళలను మోసం చేయడం ఆనవాయితీ అన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందుల పాల్జేస్తున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వ తలతిక్క నిర్ణయాల కారణంగా రైతులకు మద్దతు ధర కూడా దక్కకుండా దళారులు బాగుపడ్డారన్నారు. రైతులకు ఉపయోగపడేలా మాజీ ముఖ్యమంత్రి జగన్ తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారన్నారు. అర్హత ఉన్నప్పటికీ తల్లికి వందనం ఇవ్వకుండా మహిళలను మోసం చేశారన్నారు. ప్రతి నెలా రూ.1500, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలెండర్లు అంటూ అక్కచెల్లెమ్మలను మోసం చేశారన్నారు.

అంకెల గారడీ

మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్క తన పరిధిలోని సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా లబ్ధిదారులకు రెండున్నర లక్షల కోట్ల రూపాయలకుపైగా అందజేశారన్నారు. ఇప్పటి చంద్రబాబు ప్రభుత్వానికి ఎంత మేరకు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారో నిజాయితీగా చెప్పే ధైర్యముందా అని ప్రశ్నించారు. అంకెల గారడీలతో కాలక్షేపం చేస్తున్నారన్నారు. అందుకే బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పేరిట ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇసుక అక్రమాల్లో ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరికి వాటాలు ఉన్న కారణంగానే అక్రమాలను అడ్డుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం నిల్వ చేసిన ఇసుకను దోచుకున్నారన్నారు. ఇసుక తదితర ముడుపులుగా ప్రతి నెలా దాదాపు రూ.మూడు కోట్ల వరకూ బుచ్చయ్యకు అందుతున్నాయని రాష్ట్రం మొత్తం కోడైకూస్తోందన్నారు. ఇలా ప్రజాధనాన్ని దోచుకుంటున్న బుచ్చయ్య.. జగన్‌పై విమర్శలకు దిగుతున్నారన్నారు.

కార్యాచరణ సిద్ధం

అర్హత ఉండి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని వారి తరఫున పోరాటం చేసేందుకు క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని వేణు అన్నారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామం నుంచి కార్యాచరణను సిద్ధం చేసుకుని, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. నిస్వార్థంగా వైఎస్సార్ సీపీ తరఫున కష్టపడుతున్న కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, వారికి ఏ అవసరం వచ్చినా తామంతా ముందుంటామని తెలిపారు. పార్టీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు మాట్లాడి గ్రామస్థాయిలో పార్టీ పటిష్టతకు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, నాయకులు తాడాల చక్రవర్తి, కొత్తపల్లి శివాజీ, సంగిత వేంకటేశ్వరరావు, సూరిబాబు, సాపిరెడ్డి సూరిబాబు, కామేష్, చింతపర్తి రాంబాబు, ఆకుల సుధాకర్, ఇబ్రహీం బాషా, రాణా హరిశ్చంద్ర, అయినవిల్లి వెంకటేశ్వరరావు, బిళ్లకుర్తి ముత్యాలరావు, చిలుకూరి రామకృష్ణ, నాగిరెడ్డి మోహన్, గుబ్బల రామ్మూర్తి, కొప్పాక రమణ, అయినవిల్లి ప్రసాద్, రమేష్, శ్రీధర్, సర్కార్ బాషా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కోసం పడిగాపులు



బొగ్గులదిబ్బ రేషన్ షాపు వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ పరిధిలోని 17వ డివిజన్ బొగ్గులదిబ్బ ప్రాంతంలో గల రేషన్‌షాపు వద్ద గురువారం లబ్ధిదారులు పడిగాపులు పడ్డారు. ఉదయం 8 గంటలకు తీయాల్సిన షాపును 10.30 వరకూ తీయలేదు. దీంతో అక్కడే క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. గత నెల 26 నుంచి 30వ వరకు వృద్ధులకు ఇంటి వద్దనే బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా, అది పూర్తిస్థాయిలో అమలు కాలేదు. దీంతో వృద్ధులు సైతం రేషన్ షాపులకు రావాల్సి వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటికే వచ్చి రేషన్ సరకులు పంపిణీ చేసేవారు. ఆ విధాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వైభవంగా వారాహీ దేవి గుప్త నవరాత్రులు

- ఈ నెల పదో తేదీ వరకూ కొనసాగనున్న ఉత్సవాలు
- చివరి రోజు 108 కిలోల గంధంతో అభిషేకం
- అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపీ భరత్ రామ్



వారాహీ అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్ఐ: గాడాల గ్రామంలోని మహాలక్ష్మి సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో వరాహీ గుప్త నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకుంటున్నారు. దీనిలో భాగంగా గురువారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని విశేషంగా పూజలు నిర్వహించారు. రాశులతో, నక్షత్రాలతో కొలువైన మహాలక్ష్మి అమ్మవారే వరాహీ మాతగా దర్శనమివ్వడం ఇక్కడి విశిష్టత అని చిన్న వెంకన్నబాబు వివరించారు. మనగుడి – మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ మాట్లాడుతూ చిన్న వెంకన్న బాబు స్వీయ పర్యవేక్షణలో గత నెల 26న ప్రారంభమైన వారాహీ గుప్త నవరాత్రులు ఈ నెల పదో తేదీ వరకూ జరుగుతాయన్నారు. ఆఖరి రోజు 108 కిలోల గంధంతో అమ్మవారికి అభిషేకం నిర్వహించి, గంధపు బిళ్లలను భక్తులకు వితరణ చేస్తామన్నారు. అనంతరం మాజీ ఎంపీ భరత్‌రామ్‌ను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రేవంత్, వాసంశెట్టి గంగాధరరావు, కడియాల శ్రీనివాస్, శనివారపు ధనరాజు, చావ్వకుల శ్రీనివాసరావు, పెరవలి సాయిరామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావు కీర్తి అజరామరం

- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఘనంగా ఎస్వీఆర్ జయంతి



ఎస్వీ రంగారావు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు, పంతం కొండలరావు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ నటుడు ఎస్వీ రంగారావు కీర్తి అజరామరమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కొనియాడారు. పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు, ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్, నగర చిరంజీవి యువత ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్ పంతం కొండలరావు నేతృత్వంలో గురువారం గోదావరి గట్టున ఉన్న ఎస్వీ రంగారావు కాంస్య విగ్రహం వద్ద జయంత్యుత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీఆర్ విగ్రహానికి జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పంతం కొండలరావు, కొత్తపేట రాజా తదితరులు పుష్పాంజలి ఘటించారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఎస్వీఆర్‌ను అంతా అభిమానిస్తారని, కానీ పార్టీలకు అతీతంగా ఆయన జయంతిని ఘనంగా నిర్వహించాలన్న ఆలోచనను ఆచరణలోకి తెచ్చి, ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న పంతం కొండలరావును అభినందించారు. రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఎస్వీ రంగారావు లాంటి నటుడు యుగానికి ఒక్కడు జన్మిస్తారని కొనియాడారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ఎస్వీ రంగారావు జయంతిని క్రమం తప్పకుండా ఏటా నిర్వహిస్తున్న పంతం కొండలరావును అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గన్ని కృష్ణ, యర్రా వేణుగోపాలరాయుడు, వైఎస్సార్ సీపీ నగర మాజీ అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్, మాజీ డిప్యూటి మేయర్ బాక్స్ ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, బీజేపీ నాయకులు యెనుముల రంగబాబు, అడబాల రామకృష్ణ,, తోట సుబ్బారావు, జనసేన నగర అధ్యక్షులు వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం

ధవళేశ్వరం: ఎస్వీ రంగారావు సినీ రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జనసేన నాయకుడు యడ్ల మహేష్ పేర్కొన్నారు. బ్యారేజీ సెంటర్‌లోని ఎస్వీ రంగారావు విగ్రహం వద్ద ఆయన జయంతి నిర్వహించారు. ఎస్వీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోదావరిలోకి యథేచ్ఛగా మురుగునీరు



నల్లా చానల్ నుంచి గోదావరిలోకి వదులుతున్న మురుగునీరు



మురుగునీటితో నల్లగా మారిన గోదావరి నీరు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నగరంలోని మురుగునీరంతా నల్లా చానల్ ద్వారా గోదావరిలో కలసిపోతోంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు తోడు నగర ప్రజలు వినియోగించిన సుమారు 100 ఎమ్ఎల్‌డీ మురుగునీటిని ఏవిధమైన శుద్ధి చేయకుండా గోదావరిలో వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం.. నగరంలోని మురుగునీటిని ఆవ చానల్ ద్వారా ఎస్‌టీపీ ప్లాంట్‌కు తరలించాలి. కానీ అలాంటి చర్యలు కనిపించడం లేదు. ఆర్యాపురం వద్ద గల నల్లా చానల్‌కు వచ్చే మురుగునీటిని ప్లాస్టిక్ వ్యర్థాలతో యథాతథంగా గోదావరిలోకి వదిలి వేస్తున్నారు. అది దిగువన ఉన్న రక్షిత మంచినీటి పథకం పంపు స్టేషన్ వద్దకు చేరి, తిరిగి నగర ప్రజలకు తాగునీరుగా సరఫరా అవుతోంది. అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టిసారించి చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

కోనేరు మురళికి మాజీ మంత్రి వేణు పరామర్శ



కోనేరు సుష్మంత్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వేణు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పుత్ర వియోగంతో బాధపడుతున్న కోనేరు మురళిని గురువారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ పరామర్శించారు. మురళి కుమారుడు సుష్మంత్ వెంకట్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుష్మంత్ వెంకట్ చిత్రపటానికి చెల్లిబోయిన వేణు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం శుక్ర, శనివారాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ అన్నారు.

- శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కోర్లమ్మ పేట, రామచంద్రరావుపేట, సాంబశివరావుపేట, దేవీచౌక్, తుమ్మలావ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.
- శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ కాతేరులోని పంచాయతీ ప్రాంతం, సుబ్బారావుపేట, సంజీవ్ నగర్, శాంతి నగర్, వేణుగోపాలపురం, భరత్ నగర్, మిలటరీ కాలనీ, కొంతమూరులోని కల్యాణ్ నగర్, ఆదర్శ్ నగర్, ఎంప్లాయీస్ కాలనీ, జంగాల కాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లేఅవుట్, క్వారీ ఏరియా, ఫోర్త్ బ్రిడ్జి ఏరియాకు సరఫరా ఆగిపోతుంది.
- శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొంతమూరులోని నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లింపేట, అంబేడ్కర్‌పేట, అఫీషియల్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, కాతేరు రోడ్డు, బూసమ్మ కాలనీ, ఆర్‌సీఎం స్కూల్ ఏరియా, శ్రీరామ్ నగర్, వీవీ కొండయ్య నగర్, బ్రాహ్మణ అగ్రహారం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

గోదావరిలో పెరిగిన నీటి ప్రవాహం



బొబ్బిల్లంక - ములకల్లంక మధ్య గోదావరిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నీరు

సీతానగరం: గోదావరిలో నీటిమట్టం పెరగడంతో బొబ్బిల్లంక – ములకల్లంక గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆ గ్రామాల మధ్య గోదావరిలో నిర్మించిన తాత్కాలిక వంతెనకు గండి పడింది. అలాగే ఆ రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. గత ఏడాది గోదావరి వరద తగ్గుముఖం పట్టిన అనంతరం ఇరు గ్రామాల మధ్య గోదావరి పాయలో ఈ రోడ్డును ఏర్పాటు చేశారు. దీని మీదుగానే ఇరు గ్రామాల మధ్య రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు గోదావరి నీటి మట్టం పెరగడంతో రోడ్డు బంద్ అయ్యింది. ములకల్లంక గ్రామస్తులకు రెండు మరపడవలు ఉన్నాయి. వరదల సమయంలో వాటిపైనే రాకపోకలు సాగిస్తారు. వరద ఉధృతి ఇంకా ఎక్కువైతే అధికారులు ఆ మరపడవలపై ప్రయాణం నిషేధించి, లాంచీలను ఏర్పాటు చేస్తారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెదపూడి: వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల పరిశుభ్రంగా ఉంచడానికి అందరు కృషి చేయాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. పెదపూడి, పెద్దాడ, గండ్రేడు, జి.మామిడాడ గ్రామాల్లో లెగసి పాయింట్లను గుర్తించి కొలతలు సేకరణ ప్రక్రియ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో హానికరమైన పదార్థాలతో కూడిన వ్యర్థాలను లెగసీ పాయింట్లుగా గుర్తించి వాటి పొడవు, వెడల్పు, లోతు కొలతలు సేకరించి, ఆ ప్రదేశంలో ఉండి పీఆర్ వన్ యాప్‌లో అప్లోడ్ చేస్తున్నామన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాలపై కొలతలు సేకరణ చేపట్టమన్నారు. దీంతో మండలంలో వేల టన్నుల లెగసీ వచ్చినట్టు గుర్తించామన్నారు. ఈ నివేదికలు ఉన్నత అధికారులు తెలియజేస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై తదుపరి చర్యలు చేపడుతామన్నారు. అలాగే వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలికుండా తగిన చర్యలు తీసుకోవాలని సచివాలయం కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివాజీ, సచివాలయం కార్యదర్శులు నాగేంద్ర, ఉషారాణి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో సంక్షోభం



సాలి వేణు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

సీటీఆర్ఐ: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలనూ కూటమి ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టివేసిందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలి వేణు అన్నారు. రాజమహేంద్రవరంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎత్తి చూపుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను అవమానించేలా మాట్లాడటం కూటమి నాయకులకు సరికాదన్నారు. సాధారణ పులివెందుల ఎమ్మెల్యేకు ఎందుకంత భద్రత ఇవ్వాలని హోంమంత్రి మాట్లాడడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి అనే సంగతిని గుర్తు పెట్టుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించి, జైలుకు పంపించడం తప్పితే కూటమి ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదన్నారు. వారి ఏడాది పాలనలోనే ప్రజావ్యతిరేకత వచ్చేసిందన్నారు.

అనుమతిచ్చింది గోరంత.. తరలించింది కొండంత

- 44 రోజుల పాటు నిరాటంకంగా మట్టి తరలింపు
- ఇంత జరుగుతున్నా పట్టించుకోని ఎమ్మెల్యే, అధికారులు
- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గోరంత అనుమతి తెచ్చి 44 రోజుల పాటు రాత్రి, పగలూ తేడా లేకుండా వందల టిప్పర్లతో మట్టిని తవ్వుకుంటుంటే స్థానిక భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మౌనంగా ఉన్నారని, అధికారగణం కూడా పట్టించుకోకపోవడం చాలా దారుణమని అనపర్తి మాజీ శాసన సభ్యులు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. గురువారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగంపేట మండలం నల్లమిల్లి గ్రామంలోని జగన్నాథసాగర్ చెరువులో ఇటీవల భారీగా మట్టి అక్రమ రవాణా చేస్తు కోట్ల ప్రజాధనాన్ని దోచుకుంటున్న వైనాన్ని పలుమార్లు ఆ ప్రాంతానికి వెళ్లి అక్రమ వ్యవహారాన్ని ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపించి అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం కదలికలేదన్నారు. జీవో 203 ప్రకారం చెరువుల్లో మీటర్ లోతు మాత్రమే పూడిక తీసి స్థానిక అవసరాలకు మాత్రామే వాడాలని నిబంధన ఉన్నా అక్రమార్కులు పూర్తిగా అతిక్రమించి సుమారు 15 అడుగుల మేర తవ్వేశారని ఆయన అన్నారు.

తప్పుడు ఉత్తర్వులతో..

మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు, మైనర్ ఇరిగేషన్‌శాఖలోని కొందరు అధికారులు కలసి తప్పుడు ఉత్తర్వులను ఆధారంగా పెట్టుకుని ఏకంగా మండలం దాటించి రంగంపేట మండలం నుంచి బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలోని ప్రైవేటు లేఅవుట్‌కు సుమారు 3వేల టిప్పర్ల మట్టిని తరలించి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై తాను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.

వర్షాల కారణంగా..

యథేచ్ఛగా మట్టి తరలిస్తున్న తరుణంలో గత వారం రోజుల నుంచి వర్షాలు అధికంగా కురుస్తుండడంతో మట్టి తవ్వకాలు నిలిపివేశారని మాజీ ఎమ్మెల్యే అన్నారు. దీన్ని ఆదునుగా తీసుకుని అధికారులు మట్టి తవ్వకాలు నిలిపివేయాలంటూ ఉత్తర్వులు జారీ చేశారని కాని ఆ ఉత్తర్వుల్లో మట్టి తరలింపులో జరిగిన అక్రమాలు, నింబధనల ఉల్లంఘనలను ఎక్కడా ప్రస్తావించకపోవడం వల్ల ఇది పథకం ప్రకారం జరిగిన అవినీతిగా స్పష్టమైందన్నారు.

అంతా విడ్డూరం

వర్షం వల్ల మట్టి తవ్వకాలు ఆగిపోతే.. అధికారులు తామే నిలిపివేశామని ప్రకటనలు చేస్తు హడావుడి చేయడం చాలా విడ్డురంగా ఉందని సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. తాను చేస్తున్న ఆరోపణలను సోలో వీడియోలు అంటూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.. మట్టి తవ్వకాల అవినీతిపై మాత్రం స్పందించడం లేదని మండిపడ్డారు. జరిగిన ఈ భారీ అవినీతి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని, లేదంటే న్యాయ పోరాటం చేయడానికి కూడా వెనుకాడేది లేదని డాక్టర్ హెచ్చరించారు.

సినిమాలు



శ్యామల	: తమ్ముడు
సూర్యమినీ	: 3 బీహెచ్‌కే
సూర్యప్యాలెస్	: జురాసిక్ వరల్డ్
స్వామి	: కుబేర
అనుశ్రీ	: జురాసిక్ వరల్డ్
శివజ్యోతి	: తమ్ముడు
రాజా	: తమ్ముడు
ఊర్వశి	: 8 వసంతాలు
మేనక	: చంద్రేశ్వర, హనుమాన్ జంక్షన్
రంభ	: మా
అప్సర	: తమ్ముడు
అశోక	: కన్నప్ప
నామవరం	
వీఎస్ మహల్	: తమ్ముడు
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: తమ్ముడు
కడియం	
వెంకటసూర్య	: తమ్ముడు